ప్రజాశక్తి

సోమవారం 1 సెప్టెంబర్ 2025

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

విజయవాడను ముంచెత్తిన బుడమేరు (ఫైల్)

బుడమేరు... ఓ విషాద గీతిక

జలదిగ్బంధంలో ప్రజలు (ఫైల్)

రిక్షాపై మృతదేహాలను తరలిస్తున్న యువకులు (ఫైల్)

- ఉగ్ర తాండవంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం
- ఆనాటి పీడకలలకు ఏడాది
- చేదు జ్ఞాపకాలను మిగిల్చిన విజయవాడ దుఖ:దాయని

ప్రజాశక్తి - విజయవాడ

బుడమేరు.. ఇది ఓ విషాద గీతిక. అది లక్షలాది కుటుంబాలను రోడ్డుపాలు చేసింది. ఎంతో మంది ప్రాణాలను హరించింది. వేల కోట్ల రూపాయల నష్టాలను మిగిల్చింది. ఎంతో మంది జీవితాల్లో కన్నీరై పారింది. గత ఏడాది సెప్టెంబర్ 1న ఉగ్రరూపం దాల్చిన బుడమేరు ఎన్నో చేదు జ్ఞాపకాలను మిగిల్చిపోయింది. దీనిలో ప్రకృతి ప్రకోపం కన్నా మానవ తప్పిదాలే ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. విజయవాడ నగరంతో పాటు ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్, దిగువన గన్నవరం మండలం తదితర ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. నగరంలో 64 డివిజన్లకు 32 డివిజన్లు మునిగిపోయాయి. అధికారుల లెక్కల ప్రకారం 34 మంది చనిపోయారు. అనధికారికంగా 50 మందికిపైగా మృతిచెందారు. 6.50 లక్షల మంది ముంపునకు గురయ్యారు. 2.70 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. విజయవాడ ప్రాంతం పూర్తి జల దిగ్బంధనంలో చిక్కుకుపోయింది. నడుం లోతు నీటిలో తేలియాడింది. వేలాది ఇళు ్లలోకి నీరు చేరింది. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. విద్యుత్ సౌకర్యం నిలిచిపోయింది. నగరంలో 12 డివిజన్లలో మూడున్నర లక్షల మందికిపైగా ప్రజలు రోజుల తరబడి ముంపులోనే ఉండిపోయారు. ప్రజలకు గణనీయమైన నష్టాన్ని కలిగించింది. వేల కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఇళ్లు, పంటలు కోల్పోయారు. పలు రకాల వ్యాపారాలు దెబ్బతిని లక్షలాది మంది ప్రజలు సర్వం కోల్పోయారు. వరదలు వచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ వరద నష్టం నుంచి ప్రజలు కోలుకోలేదు.

బుడమేరు వరదకు ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనాలు 4, 5 పేజీల్లో

వీడని గ్రహణం

- కృష్ణాలో నత్తనడకన సాగుతున్న గృహ నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని వైనం

బంటుమిల్లిలో లేఅవుట్ పరిస్థితి

మచిలీపట్నంలోని కరగ్రహారం లేఅవుట్ పరిస్థితి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రభుత్వాలు, ఆ ప్రభుత్వంలో ఉండే ప్రజాప్రతినిధులు చేసే అనాలోచిత నిర్ణయాలు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో గృహ నిర్మాణ పథకం పరిస్థితి అలానే ఉంది. ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం కింద చేపట్టిన నిర్మాణాలు కృష్ణాజిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. పథకం ప్రారంభంలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పట్లో ప్రభుత్వం జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. కృష్ణాజిల్లాలో ఫేజ్-1 కింద సుమారు లక్ష గృహాలు మంజూరు చేశారు. అయితే ఐదు సంవత్సరాలు గడుస్తున్నా నేటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణాల ప్రగతిపై జిల్లా కలక్టర్ ప్రతినెలా సమీక్ష సమావేశం నిర్వహించి లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. అయితే లక్ష్యాలు మాత్రం ఒక్క అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందాన తయారయ్యాయి. గృహ నిర్మాణంలో జిల్లా చాలా వెనుకబడి ఉందని కలెక్టర్ సైతం గత సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం కింద జిల్లాలో మొత్తం 98,701 గృహాలు నిర్మించాలన్నది 2021లో అప్పటి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం. అయితే ఐదు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు 33,017 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. 32,350 గృహాలు వివిధ దశల్లో ఉంన్నారు. అసలు నిర్మాణాలు మొదలు పెట్టకుండా 33,334 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెలా కలక్టర్ సమీక్ష నిర్వహించి లక్ష్యాలు నిర్దేశించినప్పటికీ వందల సంఖ్యలో కూడా పూర్తి కావడంలేదు. గత జూలై నెల సమావేశం నుండి ఇప్పటివరకు 2,498 గృహాలను పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ కేవలం 363 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. అందులో పైకప్పు స్థాయి నుండి రూఫ్ క్యాస్టింగ్ స్థాయి వరకు 318 ఇళ్లు మాత్రమే చేరుకున్నట్లు అధికారుల నివేదికలు తెలిపాయి. ప్రస్తుతం తీసుకున్న లక్ష్యాల్లో ఇప్పటి వరకు 3,966 గృహాలు పూర్తిచేసి 40 శాతం మాత్రమే లక్ష్యం సాధించారు. మిగిలిన 6,041 గృహాలను సత్వరమే పూర్తి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మచిలీపట్నం నియోజకవర్గంలో మొత్తం 23,609 గృహాలను మంజూరు చేయగా 15,224 నిర్మాణాలు అసలు ప్రారంభించలేదు. అవనిగడ్డ నియోజకవర్గంలో 13,842 మంజూరు చేయగా 2,260 మంది, గన్నవరం 13,531 మంజూరు చేయగా 4,710 మంది, గుడివాడ 6,168 మంజూరు చేయగా 2,643 మంది, పామర్రు 11,839 మంజూరు చేయగా 2,256 మంది, పెడన నియోజకవర్గంలో 9,828 మంజూరు కాగా 1,389 మంది, (మిగతా 2లో)

వసతి గృహాల్లో నాణ్యమైన విద్య

కృష్ణాజిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి జి.రమేష్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆ శాఖ అధికారి జి.రమేష్ తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని వసతి గృహాలు ఉన్నాయి?

జవాబు : ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 27, పోస్టుమెట్రిక్ వసతి గృహాలు 16 ఉన్నాయి.

ప్రశ్న : ఎంత మంది విద్యార్థులున్నారు?

జవాబు : ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో 1160 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 1208 మందికి పెరిగింది. అలాగే పోస్ట్ మెట్రిక్ గృహాలకు సంబంధించి 958 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఇప్పటివరకు 948 మంది చేరారు. ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి కాబట్టి ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

ప్రశ్న : వసతి గృహాల్లో మరమ్మతుల పరిస్థితి ఏమిటి?

జవాబు : మొదటి విడతలో జిల్లా కలెక్టర్ డిఎంఎఫ్ నిధులతో 24 వసతి గృహాలు మరమ్మతులు చేయటానికి నిధుల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 3.37 కోట్లు కేటాయించారు. వీటితో ఇప్పటికే 15 వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేయడం జరిగింది. మిగతావి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

ప్రశ్న: వసతి గృహాలు ఎన్ని ప్రారంభించారు?

జవాబు: మూతబడిన మూడు వసతి గృహాలను తిరిగి పునఃప్రారంభించడం జరిగింది. గూడూరు, నాగాయలంక, తాడిగడపలో ప్రారంభించాం.

ప్రశ్న: పదో తరగతి ఫలితాలు ఎలా ఉన్నాయి?

జవాబు : వసతి గృహాల సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించి ఈ ఏడాది ఫలితాల్లో మెరుగుదల సాధించాం. 2023-24లో 81.38 శాతం ఉత్తీర్ణత సాధించగా 2024-25లో 85 శాతానికి పెంచాం. వసతి గృహాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నాం.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

నిత్యం ప్రతి ఒక్కరూ యోగాను చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ చెప్పారు. కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి యోగాసన పోటీలు ఆదివారం జరిగాయి. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమానికి చాలా చక్కగా నిర్వహించి వరల్డ్ రికార్డును కూడా నమోదు చేశామన్నారు. యోగాను ప్రతి రోజూ సాధన చేయడం ద్వారా శారీరకంగా ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మానసికంగా కూడా చాలా ప్రశాంతంగా ఉండవచ్చునని చెప్పారు. రోజులో కనీసం ముప్పై నిమిషాలు యోగా చేయడం ద్వారా చేసే పనిలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. చక్కటి ఆరోగ్యానికి యోగా రామబాణం వంటిందని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ యోగా అనేది భారతీయుల రక్తంలోనే ఉందన్నారు. చదువుతో పాటుగా యోగాపై కూడా దృష్టి పెట్టాలన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్.ఆంజనేయులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా చక్కటి ఆరోగ్యానికి దోహదం చేసే యోగాసనాల పోటీలను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్‌జూబ్లీ హరిత అధ్యక్షుడు కోటా ఫణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కాకాని శ్రీనివాసరావు, కోశాధికారి తిరుమలరావు, యోగా గురువు అంకాల సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, మాజీ డిఎస్‌డిఓ శాప్ యోగా కోచ్ ఆర్.రవి, కృష్ణాజిల్లా ఎన్టీఆర్ కంబైన్డ్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ, గుంటూరు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైత్రి, డి.ధీరజ్ శ్రీకృష్ణ సాలెం రాజు చేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

డివిజన్లలో జ్వరాల సర్వే

ప్రజాశక్తి-విజయవాడ: జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) డా. సుహాసిని, ఎన్టీఆర్ జిల్లా డీఎంఓ డా. మోతీబాబు ఆదేశాల మేరకు సింగ్‌నగర్ 57వ డివిజన్ నుంచి 64వ డివిజన్ వరకు యుపిహెచ్‌సి శాంతి నగర్, న్యూ ఆర్.ఆర్.పేట, అజిత్ సింగ్ నగర్, సింగ్ నగర్, వాంబే కాలనీ, ప్రకాశ్ నగర్, రాజీవ్ నగర్, కండ్రిక తదితర ప్రాంతాల్లో జ్వరం సర్వేతో పాటు పిడిపి సర్వే (పెరి డొమెస్టిక్ పాట్స్ కార్యక్రమం) ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇంటింటి సర్వే చేసి కేసులు గుర్తించడం, చుట్టుపక్కల లార్వా తొలగింపు కార్యక్రమాలు, దోమల నియంత్రణ , కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

సిఆర్‌ఐ సోలార్ పంప్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సిఆర్‌ఐ పంప్స్ విభాగం సిఆర్‌ఐ సోలార్ పంప్ పథకం ప్రారంభించినట్లు సంస్థ ఛైర్మన్ జి.సుందర రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌ఈడీసీఎల్ నుంచి ఎంప్యానెల్‌మెంట్ అనేది కేవలం ఒక వ్యాపార విజయం మాత్రమే కాదని, ఇది భారతీయ రైతులకు శుభ్రమైన, విశ్వసనీయమైన, సుస్థిర జల పరిష్కారాలు అందించే సాధికారతలో ఒక కీలక అడుగు అని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన స్వీకరణను వేగవంతం చేస్తూ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు నమ్మకమైన నీటిపారుదల అందించడంలో మహారాష్ట్రకు సహకరించడం తమకు గర్వకారణమన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శాంతి భద్రతల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో పటిష్టమైన బందోబస్తును నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు ఏర్పాటు చేశారు. ఊరేగింపులు జరిగే అన్ని ప్రదేశాలలో, నిమజ్జనం జరిగే ప్రదేశాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ డ్రోన్ కెమెరాలను, సి.సి.కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కమాండ్ కంట్రోల్ నుండి వినాయక నిమజ్జన ఊరేగింపులను, నిమజ్జన కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించి ఎప్పటికప్పుడు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేస్తూ అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడిసిపి ప్రసన్నకుమార్, ఎస్‌బి ఏసిపి భాను ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీ పార్కులో ఆధునిక గ్రంథాలయం నిర్మించాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

గాంధీ పార్కులో ఆధునిక గ్రంథాలయం నిర్మించాలని పౌర అభివృద్ధి వేదిక కన్వీనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన మోటూరి హనుమంతరావు భవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విజయవాడ పశ్చిమ నగరంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన గ్రంథాలయం కొంతకాలంగా మూసివేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు విజ్ఞానం దూరం అవుతుందని తెలిపారు. గ్రంథాలయ సమైక్య జిల్లా కార్యదర్శి వై శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజల విద్యా వైజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలని కోరారు. పౌర సంక్షేమ సంఘం పశ్చిమ నగర నాయకులు, 50 వడివిజన్ కార్పొరేటర్ బి సత్యబాబు మాట్లాడుతూ ప్రజల నుండి ఆస్తి పన్నులో లైబ్రరీ సేస్ వసూలు చేస్తూ రీడింగ్ రూమ్‌లో గ్రంథాలయాలు నిర్వహించకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సాధన కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ఏ వెంకటేశ్వరరావు, హేమ, తులసిరాం, నరసింహారావు, ఎం సుభానిలను ఎన్నుకున్నారు. విద్యార్థులు, పౌరులతో సంతకాల సేకరణ చేపట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వాలని ఈ సందర్భంగా తీర్మానించడం జరిగింది.

బ్యారేజీకి తగ్గిన వరద

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం భారీగా తగ్గింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం తగ్గడంతో పాటు తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాగులు, వంకల ఉధృతి కూడా తగ్గింది. దీంతో కృష్ణానదికి చేరుతున్న వరద ప్రవాహం భారీగా తగ్గింది. ఆదివారం రాత్రి ఇన్‌ఫ్లో 2,25,641 క్యూసెక్కులు ఉండగా బ్యారేజీ 69 గేట్లను ఎత్తి సముద్రంలోకి 2,10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు ప్రధాన కాల్వకు 8,419 క్యూసెక్కులు, పశ్చిమ ప్రధాన కాల్వకు 6,522 కూసెక్కుల నీటిని సాగు అవసరాల నిమిత్తం వదిలారు.

7న కృష్ణా జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

కృష్ణాజిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7న జిల్లా సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో 7వ తేదీ ఉదయం 7గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లు సెప్టెంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటాయని తెలిపారు.

హామీల అమలుకు కృషి : తాతయ్య

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించిందని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నివాసంలో శనివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది మెగా డీఎస్సీ నిర్వహించి, యువ ఉపాధ్యాయులతో రాష్ట్ర విద్యారంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, ధూళిపాళ్ల లక్ష్మణరావు, యానాల గోపిచంద్, కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, సూర్యదేవర రాంప్రసాద్, కర్ల జోజి, దువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయప్రద ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచిత సంచార వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా అనేక మంది ప్రజలు వైద్య సదుపాయాలు పొందారు. ఈ కార్యక్రమం ముగింపు పట్టణంలోని కోదాడ రోడ్డులో హోటల్ గ్రాండ్ వధువర్‌లో శనివారం రాత్రి ఫౌండేషన్ అధ్యక్షులు టి.డి. జనార్దన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం శ్రీ రఘురామ్, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరై శిబిర విజయాన్ని అభినందించారు. ఫౌండేషన్ అధ్యక్షులు టి.డి. జనార్దన్ కృషి వల్లే ఈ శిబిరం విజయవంతమైందని ప్రశంసించారు.

డాక్టర్ అనిల్‌కుమార్‌కు సన్మానం

పట్టణంలోని హోటల్ గ్రాండ్ వధువర్‌లో నిర్వహించిన డాక్టర్ అనిల్ కుమార్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, శ్రీదేవి (అమ్మాజీ) దంపతులు పాల్గొని, డాక్టర్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ.. అంకితభావం, క్రమశిక్షణ, సేవా తపనతో వైద్య వత్తిని పూజ్యమైనదిగా నిలబెట్టిన డాక్టర్ అనిల్ కుమార్ జీవన విధానం నేటి తరానికి ఆదర్శని కొనియాడారు.

మొదటిపేజీ తరువాయి

వీడని గ్రహణం

పెనమలూరు 16,291 మంజూరు చేయగా 7,029 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు అసలు ప్రారంభించలేదు.

లే అవుట్‌లే ప్రధాన సమస్య

జిల్లాలో గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం కేటాయించిన లే అవుట్‌లు నిర్మాణాలకు అనుకూలంగా లేవని లబ్ధిదారులు చెబుతున్నారు. అప్పటి ప్రజా ప్రతినిధులు వారి స్వలాభం కోసం నిర్మాణాలకు పనికి రాని స్థలాలను కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలకు ప్లాట్లు కేటాయించారని విమర్శలు వినబడుతున్నాయి. ప్రధానంగా మచిలీపట్నం, పెడన, గుడివాడ, పెనమలూరుల్లో ఈ సమస్య కనబడుతుంది. లబ్ధిదారులు కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించాలంటే ప్రభుత్వం ఇచ్చే బిల్లులు లేఅవుట్ మెరక చేసుకునేందుకు సరిపోతాయని ఇంకా నిర్మాణాలు ఏ విధంగా ప్రారంభించాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణాలు పూర్తిస్థాయిలో ముందుకు సాగాలి అంటే ప్రభుత్వమే లేఅవుట్లను పూర్తిస్థాయిలో మెరక తోలించి పథకం విలువ పెంచాలని లబ్ధిదారులు అంటున్నారు.

మార్చి 31తో ముగియనున్న గడువు

కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల లబ్ధిదారుల ప్రయోజనం కోసం ప్రస్తుతం గడువు పొడిగించింది. వచ్చే మార్చి 31వ తేదీలోగా గడువు ముగిస్తున్నందున ఆలోగా ఈ పథకం కింద చేపట్టిన నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాల్సి ఉంది. పురోగతి ఇదే విధంగా ఉంటే నిధులు కూడా నిలిచిపోయే అవకాశం ఉందని కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు.

ప్రజల్ని జాగ్రతపరిచే సాహిత్యం రావాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

కవులు సమాజంపట్ల బాధ్యత వహించి చైతన్యవంతమైన, ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం సృజన చేయాలని కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఎంఎండి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం ఉదయం ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీ విజేతలకు ఓ2024 ఎక్స్ రే అవార్డుల ప్రదాన కార్యక్రమం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటి హాల్ నందు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ సామాన్యులకు కూడా అర్ధమయ్యే భాషలో కవిత్వం రాయాలని తెలిపారు. వేమన, గుర్రం జాషువా, మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని ఇంతియాజ్ విశదపరిచారు. డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణ వేణి మాట్లాడుతూ మహిళలు కూడా కవిత్వ రచనలో ముందుండాలని అన్నారు. ఎక్స్ రే అధ్యక్షులు కొల్లూరి సభాధ్యక్షత వహిస్తూ గత 44 సంవత్సరాలుగా ఈ కవితల పోటీలు నిర్వహించి, విజేతలకు చిరస్థాయిగా గుర్తుండేలా అవార్డు ప్రదానం, సత్కారం చేస్తామన్నారు. ఎక్స్ రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ వర్తమాన సమస్యలను ప్రతిబింబిస్తూ చేసే రచనలు చిరకాలం ప్రజల మనస్సుల్లో ఉంటాయని తెలిపారు. ప్రధాన అవార్డు గ్రహీతగా కన్నీటి రణం కవిత రచించిన మానుకోటకు చెందిన అక్షరం ప్రభాకర్‌కు 12 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఉత్తమ కవులుగా మామిడిశెట్టి శ్రీనివాసరావు (దొడ్డిపట్ల), శ్రీధర్ బాబు (నెల్లూరు), చిత్రాడ కిషోర్ కుమార్ (విజయవాడ), జగరావు శంకరరావు (గజపతి నగరం), శ్రీకంఠస్ఫూర్తి (విజయవాడ), దువ్వూరి రమేష్ బాబు (నెల్లూరు), ధవళేశ్వరపు రవికుమార్ (విశాఖపట్నం), డాక్టర్ కోరుప్రోలు హరనాథ్ (హైదరాబాదు)లు వెయ్యి రూపాయిల నగదు, జ్ఞాపిక, శాలువా అవార్డుతో సత్కరించారు. న్యాయనిర్ణేత, కవి, జర్నలిస్ట్ సర్వజిత్ బహుమతి కవితలను విశ్లేషించారు. సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, పొత్తూరి సీతారామారావు, బి వసంత కుమార్, కొల్లూరి కనకవల్లి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేడు కలెక్టరేట్‌లో మీ కోసం

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా)

కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు .ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటకాలు

ప్రజాశక్తి - గుడివాడ

అంతరించి పోతున్న ఆనాటి పౌరాణిక నాటకాలను ప్రోత్సహిస్తూ జనవాహిణి కనదుర్గ మహాత్యం(మహిషాసుర మర్ధిని) పౌరాణిక, పద్య నాటకాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహించడం వల్ల కళాకారులకు మళ్ళీ జీవనం మెరుగు పడుతుందని కళాకారుల సమైఖ్య నాయకులు శ్యామ్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఏలూరురోడ్డులోని చిన్న కారులు స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఓనర్స్, డ్రైవర్స్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి విజయవాడ సౌజన్యంతో శ్రీ నవ్యకళా అధ్యక్షురాలు జి.శివకుమారి ఆధ్వర్యంలో కనదుర్గ మహాత్యం(మహిషాసురమర్ధిని) పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఈ నాటకంలో ప్రధాన పాత్రదారులు కనకదుర్గగా బి.నాగలక్ష్మీ, మహిషాసురిణిగా బి.శ్రీనివాసనాయుడు, నారదునిగా పుప్పాల రంగారావు, చిత్రలేఖగా జి.శివకుమారి, శంకరునిగా జంక్షన్ అప్పారావు, దేవాంతకునిగా బి. మోహన్, సిద్ధునిగా బి.శోభారాణిల నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

కనదుర్గమహత్యంలోని నటీమణులు

అడుగడుగునా గుంతలే

- ఎల్లంకి రహదారిపై ప్రయాణం ప్రమాదభరితం

ప్రజాశక్తి-వీరులపాడు

మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు అనుసంధానించిన ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ఎల్లంకి, కొణతాలపల్లి, పల్లంపల్లి ఆర్అండ్‌బి రహదారిపై అడుగుకో గుంత ఏర్పడింది. ఎల్లంకి రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా అనేక మంది వాహనదారులు గాయాలపాలువుతున్నారు. గోకరాజుపల్లి నుండి పల్లంపల్లి వరకు ఆరు కిలోమీటర్ల దూరం ఉన్న రహదారిలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది మంది వాహనదారులు వీరులపాడు నుండి నందిగామకు, తెలంగాణ ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. నందిగామ వెళ్లడానికి పల్లంపల్లి, దాములూరు రహదారి కూడలి వద్ద వరదలు రావడంతో ఈ ప్రాంత ప్రజలు ఇతర గ్రామాల వెళ్లేందుకు ఎల్లంకి రహదారి ప్రధాన మార్గంగా ఉంది. గుంతలుపడిన రోడ్డుపై ప్రయాణించడం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. రాత్రివేళ ప్రయాణం ప్రమాదాలకు నిలయంగా మారాయని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వం తాత్కాలికంగా గోతులు పూడ్చిన మరమ్మతులు చేసినా యథామాములుగానే మారడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి ఎల్లంకి ప్రధాన రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు. వరదలకు పల్లంపల్లి- దాములూరు కూడలి వద్ద లోలెవెల్ వంతెన దెబ్బతింది. అక్కడ బ్రిడ్జి నిర్మాణం గత పది సంవత్సరాలుగా అసంపూర్తిగా నిర్మాణంతో ఉంది. జగ్గయ్యపేట, నందిగామ ఎమ్మెల్యేలు అధికార పార్టీకి చెందిన వారైనప్పటికీ ఈ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం కావాల్సిన నిధుల కేటాయింపులో ప్రభుత్వం వైఫల్యం చెందుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కూడలి లోలేవంతన కోతకు గురైంది. ఉన్న కాస్త రహదారి కూడా లేకుండా పోయింది. వెంటనే రహదారిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాజేంద్రకు ఘన సన్మానం

చల్లపల్లి :గ్రామ రెవెన్యూ అధికారి గొల్లపూడి రాజేంద్ర సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. చల్లపల్లి గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ పదవి విరమణ చేసిన రాజేంద్ర అభినందన సభ ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రంలో జరిగింది. డిఆర్‌ఓ సిసి తూము వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఆర్ డి ఓ కే స్వాతి,జెడ్ పిటిసి సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎఎస్ఓ అఖిలా పర్వీన్, ఆర్ ఐ ఘంటసాల కృష్ణ మోహన్ రావు, వి ఆర్ ఉద్యోగ నేత పివి మాధవేంద్రరావు, ప్రజా ప్రతినిధులు ఆర్డిఓ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొని ప్రసంగించారు. రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు వివిధ వర్గాల ప్రముఖులు రాజేంద్ర దంపతులను ఘనంగా సత్కరించారు.

గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం

- వీధుల్లో గుంపులు, గుంపులుగా సంచారం
- పాదచారులు, వాహనదారులపై దాడి
- నియంత్రణకు చర్యలు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలంలోని 10 గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను బెంబే లెత్తిస్తున్నాయి. గ్రామాల్లో ఏ వీధి చూసిన కుక్కలు విచ్చలవిడి తిరుగుతున్నాయి. రహదారులపై వెళ్తున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారుల రాక పోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులను వీధి కుక్కలు వెంబడి స్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

మండల కేంద్రమైన గన్నవరంతో పాటుగా కేసరపల్లి, దావాజీ గూడెం, అల్లాపురం, వెంకట నరసింహాపురం, ముస్తాబాద, సూరంపల్లి గ్రామాల్లో వీధి కుక్కలు అధిక సం ఖ్యలో సంచరిస్తూ దాడులకు తెగబడుతున్నాయి. గత మూడు నెలలుగా వీధి కుక్కల సంఖ్య గ్రామాల్లో విపరీతంగా పెరిగింది. వీధుల్లో ఎక్కడ చూసిన సమూహాలుగా తిరుగుతున్న గ్రామ సింహాలు దర్శనమిస్తున్నాయి. రోడ్లపై తిరుగుతున్న కుక్కలు ఎవరిని వదిలిపెట్టడం లేదు. రాత్రి వేళలో బైక్ పై వెళ్తున్న వ్యక్తులను వీధి కుక్కలు దాడి చేసేందుకు వెంబడిస్తుండటంతో ప్రమాదాలు నిత్యకత్యంగా మారాయి. అంతేకాక వీధి కుక్కల దాటికి విద్యార్థులు, చిన్నారులను రోడ్లపైకి పంపించేందుకు తల్లితండ్రులు భయపడుతున్నారు. వీధులు, అంతర్గత రోడ్లలోనే కాకుండా ప్రధాన రహదారుల్లోనూ స్వైరవిహారంతో భయాందోళనకు గురి చేస్తున్నాయి.

నామమాత్రంగా చర్యలు

వీధి కుక్కలు అధికం కావటంపై వస్తున్న ఫిర్యాదులపై గ్రామ పంచాయతీ అధికారులు నామమా త్రపు చర్యలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాడులు జరిగినప్పుడు వీధి కుక్కల పట్టివేతకు చర్యలు చేపట్టి, ఆ తర్వాత వదిలేస్తు న్నారు. మండలంలో వీధి కుక్కల కాటుకు గురవుతున్న వారికి ప్రభుత్వాస్పత్రుల్లో యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా పెరు గుతున్న వీధి కుక్కలను నియంత్రించేందుకు కనీసం ఏడాదికి ఒక్కసారైనా పంచాయతీ అధికా రులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరు తున్నారు.

కుక్కలు గుంపులుగా ఉన్న మాట వాస్తవమే
చెన్నకేశవరావు పంచాయతీ కార్యదర్శి, గన్నవరం,

గ్రామంలో గుంపులుగా కుక్కలు తిరుగుతున్న మాట వాస్తవమే. అయితే వాటిని నిర్మూలించడానికి కుదరటం లేదు. చట్టాలు ఆ విధంగా ఉన్నాయి. వాటిని పట్టించి వేరొక చోట వదిలి పెట్టాలన్న ఇబ్బంది అవుతుంది. అటవీ ప్రాంతంలో వదలడం కష్టంగా ఉంది. ముఖ్యంగా కొంతమంది కుక్కలను పెంచుతున్నారు కానీ ఇళ్లలో భద్రం చేయడం లేదు. రోడ్లమీదకు వదిలివేయడం వల్ల జనాల మీద దాడులు చేస్తున్నాయి. ఏదేమైనా కుక్కల సంఖ్యను తగ్గించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. పై అధికారుల దష్టికి సమస్య తీసుకు వెళ్తాం.

ఆర్థిక సాయం అందజేత

తొట్లవల్లూరు : పామర్రు నియోజకవర్గ తోట్లవల్లూరు మండల పరిధిలోని రొయ్యూరు గ్రామానికి చెందిన మోర్ల హంసకు ఆదివారం లయన్ ఇంజనీర్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా లయన్ ఇంజనీర్ రావి సురేష్ బాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ వారి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో చాగర్లమూడి గోపాలరావు, లుక్కా నాగార్జున, ఉప్పులూరి గోపాలకృష్ణ, లుక్కా రేణుకా రావు, గుంటూరు కేశవరావు, రావి సాంబశివరావు, కాసరనేని కృష్ణప్రసాద్, పెద్ది ప్రసాద్, పెద్ది గోపాల కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

శాంతి, సామరస్యం నెలకొల్పాలి

గన్నవరం : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కేసరపల్లి హేమ దుర్గ జ్యూయల్ కొంటి లో ఆదివారం లక్ష్మీ గణపతి హెూమాన్ని మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు శాంతి సామరస్యాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాస్తి వెంకటేశ్వరరావు, కలపాల వెంకటరమణ, కంభంపాటి హేమంత కోటేశ్వరరావు, సురేష్, కేసరపల్లి ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో డిజెలు వద్దు : సిఐ

ప్రజాశక్తి-కోడూరు

వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీజేలు వద్దని, సాంప్రదాయమే ముద్దని అవనిగడ్డ సీఐ యువకుమార్ తెలిపారు. ఆదివారం కోడూరు మండల పరిధిలోని మందపాకల గ్రామంలో పోలీస్ వారి సూచనల మేరకు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని కమిటీ వారు సాంప్రదాయ బద్ధంగా, డప్పుల వాయిద్యాల మధ్య నిర్వహించారు. ఈ నిమజ్జన కార్యక్రమాన్ని సి ఐ యువకుమార్ కోడూరు ఎస్సై చాణిక్య పర్యవేక్షించారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న 1టౌన్ సిఐ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - గుడివాడ

అనుకోని కొన్ని సంఘటనల వల్ల దురుసుగా ప్రవర్తించి, చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఇప్పటికైన మంచి జీవితం గడపి రౌడీషీటర్ అనే పదాన్ని తొలగించుకోవాలని 1టౌన్ సి.ఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం స్థానిక 1టౌన్ పోలీసు స్టేషన్లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు వినాయక చవితి సందర్భంగా ఎంటువంటి అల్లర్లు జరిగినా వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఐదో రోజు వినాయకుని ఉత్సవాలు

ప్రజాశక్తి- కంచికచర్ల

వినాయకుని నవరాత్రి ఉత్సవాలు భాగంగా 5వ రోజు ఆదివారం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కంచికచర్ల మండలంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన పందిళ్లలో వినాయకుని విగ్రహాల వద్ద పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వసంత కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం చేశారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగించి, కీసర మునేటిలో నిమజ్జనం చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా
సోమవారం
1 సెప్టెంబరు 2025

సింగ్‌నగర్ ప్రాంతంలో నీటమునిగిన ఇళ్లు (ఫైల్)

బుడమేరు....ఓ విషాద గీతిక

- ఉగ్ర తాండవంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం
- ఆనాటి పీడకలకు ఏడాది
- చేదు జ్ఞాపకాలను మిగిల్చిన విజయవాడ దుఃఖదాయని

ప్రజాశక్తి - విజయవాడ : గత ఏడాది సమయంలో బుడమేరు వరదలతో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలు అతలాకుతలమయ్యాయి. భారీ స్థాయిలో వరదలు వచ్చాయి. తెలంగాణా ప్రాంతం నుండి కూడా వరద నీరు 70 వేల క్యూసెక్కులకుపైగా చేరింది. ఇది సాధారణ గరిష్ట స్థాయి 11 వేల క్యూసెక్కుల కంటే చాలా ఎక్కువ. దీంతో బుడమేరు ఉధృతికి రెండు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో విజయవాడ నగరంతోపాటు చుట్టుపక్కన ప్రాంతాలను ముంచెత్తింది. విజయవాడ నగరంతోపాటు ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్, దిగువన గన్నవరం మండలం తదితర ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. నగరంలో 64 డివిజన్లకుగాను 32 డివిజన్లు మునిగిపోయాయి. అధికారుల లెక్కల ప్రకారం 34 మంది చనిపోయారు. అనధికారికంగా 50 మందికిపైగా మృతిచెందారు. 6.50 లక్షల మంది ముంపునకు గురయ్యారు. 2.70 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. విజయవాడ ప్రాంతం పూర్తి జల దిగ్బంధనంలో చిక్కుకుపోయింది. నడుం లోతు నీటిలో తేలియాడింది. గతంలో ఎన్నడూలేని విధంగా ముంపునకు గురిండి. ఊహించనివిధంగా వచ్చిన వరద ఉధృతితో ప్రజలు నీటిలో చిక్కుకుపోయారు. వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. విద్యుత్ సౌకర్యం నిలిచిపోయింది. బిక్కుబిక్కు మంటూ జీవనం సాగించారు. ముఖ్యంగా విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని బుడమేరు వరద చుట్టుముట్టింది. నాలుగడుగుల ఎత్తులో వచ్చిన వరద నీటిలో ఇళ్లకు చిక్కుకుపోయాయి. నగరంలో 12 డివిజన్లలో మూడున్నర లక్షల మందికిపైగా పజలు రోజులతరబడి ముంపులోనే ఉండిపోయారు. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. భవనాలపై నుండి 'మాక్కు భోజనం పెట్టండి ప్లీజ్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించాల్సిన దుస్థితి ఏర్పడింది. మంచినీరు, ఆహారం, విద్యుత్ లేక అవస్థలు పడ్డారు. పసి పిల్లలకు పాల ప్యాకెట్లు కూడా దొరకలేదు. బాధితులు పడిన కష్టాలు ప్రతి ఒక్కరినీ కలిచివేశాయి. 'మాకు సాయం చేయండి అంటూ దీనంగా వేడుకున్నారు. ఇళ్లల్లోని సామాన్లు మొత్తం నీటి పాలయ్యాయి... కోళ్లు, పశువులు, మేకలు, గొర్రెలు, కుక్కలు వరదలో కొట్టుకుపోయాయి. వరద బాధితులు పడిన అవస్థలు వర్ణనాతీతం. ప్రజలకు గణనీయమైన నష్టాన్ని కలిగించింది. వేల కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఇళ్లు, పంటలు కోల్పోయారు. పలు రకాల వ్యాపారాలు దెబ్బతిని లక్షలాది మంది ప్రజలు సర్వం కోల్పోయారు. వరదలు వచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ వరద నష్టం నుంచి ప్రజలు కోలుకోలేదు. అధికారిక లెక్కల ప్రకారం 53 వేల ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 36,923 ద్విచక్ర వాహనాలు, 2 వేల కార్లు దెబ్బతిన్నాయని, 26,545 టివిలు, 31 వేలకుపైగా ఫ్రిజ్‌లు, 20 వేలకుపైగా వాషింగ్ మెషీన్లకు నష్టం వాటిల్లిందని అంచనా వేసింది. అలాగే వ్యవసాయ రంగానికి రూ.5 వేల కోట్లకుపైగా నష్టం జరిగినట్లు అంచనా వేసింది.

మంచినీటి కోసం ఎగబడుతుతన్న దృశ్యం

బోటులపై ప్రయాణిస్తున్న స్థానికులు (ఫైల్)

బుడమేరు చరిత్ర

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు ఓ వాగు. ఇది ఖమ్మం - ఎన్‌టిఆర్ జిల్లాల సరిహద్దు ప్రాంత కొండల్లో పుట్టి విజయవాడ నగరంతోపాటు కృష్ణాజిల్లా మీదుగా సుమారు 160 కిలో మీటర్లకుపైగా ఎన్నో వంపులుగా ప్రవహిస్తూ ఏలూరు జిల్లా కొల్లేరు సరస్సులో కలుస్తుంది. దీని పరీవాహన ప్రాంతాలుగా విజయవాడ నగరంతోపాటు ఎ.కొండూరు, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, గుడివాడ, నందివాడ తదితర మండలాలు ఉన్నాయి. బుడమేరుకు రెడ్డిగూడెం నుండి కోతుల వాగు, జి.కొండూరు మండల గంగినేని నుండి పులివాగు, మునగపాడు నుండి బీమ్ వాగు, సీహెచ్ మాధవరం నుండి లోయవాగు, గడ్డమణుగు లోయప్రాంతం నుండి దొర్లింతలవాగు ఉపవాగులుగా ఉన్నాయి. బుడమేరు వాగును విజయవాడ దుఖ: దాయినిగా చెప్పవచ్చు. ఈ వాగు వరదలను నివారించ డానికి 70వ దశకంలో జి.కొండూరు మండలం వెలగలేరు వద్ద రెగ్యులేటర్‌ను నిర్మించారు. ఈ రెగ్యులేటర్ నుండి నిర్మించిన కాల్వను బుడమేరు డైవర్షన్ ఛానల్ (బిడిసి)గా పిలుస్తారు.

బుడమేరు డైవర్షన్ ఛానల్ ద్వారా నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రం వద్ద కష్ణా నదిలో కలుస్తుంది. అలాగే పోలవరం కుడికాల్వ ఈ రెగ్యులెటర్ వద్ద ముగిసి, బుడమేరు డైవర్షన్ ఛానల్లో కలుస్తుంది. డైవర్షన్ ఛానల్ 10,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం కలిగి ఉంది. అయితే పోలవరం కుడికాల్వ డిజైన్ కెపాసిటికీ సరిపోయేలా దాని ప్రవాహ సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచాల్సి ఉంది.

నేటికీ అందని సాయం

బుడమేరు ముంపు బాధితులకు ప్రభుత్వం నుండి సాయం అందలేదు. ఎంతో మంది ఇళ్లు, వ్యాపారాలు, వాహనాలు, ఇతర వస్తువులు పూర్తిగా దెబ్బతినిపోయినా ప్రభుత్వం ఆదుకోలేదు. ఈ నేపథ్యంలో అజిత్ సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతాల ప్రజలు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆటోకు నష్టపరిహారం ఇవ్వలేదు
నూకల శివప్రసాద్, ఆటోడ్రైవర్

నో వెహికల్‌గా నమోదైందనే సాకుతో నా ఆటో (ఎపి 39 యు జి 6958)కు నష్టపరిహారం ఇవ్వలేదు.

మంత్రి లోకేష్ వద్దకు వెళ్లినా సాయం అందలేదు
ఓర్సు పద్మ, మున్సిపల్ డ్వాక్రా కార్మికురాలు

వరదలో మునిగిన మా ఇంటికి సహాయం అందలేదు. మరోవైపు నా వేతనంలో కోత పెట్టారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, మంత్రి లోకేష్ వద్దకు వెళ్లి దరఖాస్తులు పెట్టుకున్నా సహాయం ఇప్పటికీ అందలేదు.

నయాపైసా సాయం అందలేదు
షేక్ మౌలాలి, కుమారుడు అక్బర్ బాషా

ఇంటికి, షాప్‌కు, రెండు మోటారు వాహనాలకు నయా పైసా సాయం అందలేదు.

చేతివృత్తి దెబ్బతింది
గుండాల గంగాధరరావు, ఇస్త్రీ బండి

ఇస్త్రీ బండి ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అయితే వరదలకు చేతివృత్తి దెబ్బతినిపోయినా ఎటువంటి సహాయం అందలేదు.

ఇంటికి, కుట్టుమిషన్లకు సాయం రాలేదు
లక్ష్మీ ప్రసన్న

నాలుగు కుట్టు మిషన్లతో జీవనం సాగిస్తున్నాం. రెండు మిషన్లు పూర్తిగా, మరో రెండు మిషన్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇంటికి, కుట్టు మిషన్లకు ఎటువంటి సహాయం అందలేదు. ప్రస్తుతం రెండు మిషన్లతోనే వత్తి సాగిస్తున్నా.

ముంపు బాధితుల ఐక్య వేదిక ఏర్పాటు

- నేడు కలెక్టరేట్లో వినతిపత్రాల సమర్పణ
- సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు సమస్యలపై ఐక్య పోరాటానికి ప్రజలు సన్నద్ధమయ్యారు. నగర ప్రజలను బుడమేర వరద ముంపు బారి నుంచి శాశ్వతంగా కాపాడుకు నేందుకు రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి ఉద్యమించాలని నిర్ణయించుకున్నారు. బుడమేరు ముంపు బాధితుల ఐక్యవేదికను ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాకుండా సెప్టెంబర్ 1న విజయ వాడ నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు ముంపు బాధితుల ఐక్యవేదిక ఆధ్వర్యాన పలు ప్రజా, పౌరసంక్షేమ సంఘాల నేతలు, వివిధ కాలనీల వాసులు, అపార్టుమెంట్స్ అసోసియేషన్లు, ప్రింటింగ్ ప్రెస్‌ల అసోసియేషన్లు, చిన్న పరిశ్రమల అసోసియేషన్లు, చేతివృత్తులు, షాపుల యజమానులు వినతిపత్రాలు అందజే యాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం వెంటనే శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయనున్నారు.

సిపిఎం పాదయాత్ర

బుడమేరు సమస్యలపై ఆగస్టు 24 నుంచి 29వ తేదీ వరకు సింగ్‌నగర్‌లో సిపిఎం పాదయాత్ర నిర్వహించింది. 30న సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటరులో వినూత్న రీతిన ధర్నా నిర్వహించింది. నాయకులు పలు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను కలుసుకొని వారి గోడు విన్నారు. పలుచోట్ల సభలు, సమావేశాలు నిర్వహించి బాధితుల కష్టాలు తెలుసుకున్నారు.

వరదకు నీట మునిగిన కార్లు (ఫైల్)

సామానులతో తరలుతున్న ప్రజలు (ఫైల్)

ముంపు నివారణకు అవసరమైన శాశ్వత చర్యలు ఇవీ

ప్రజాశక్తి - విజయవాడ

- ప్రభుత్వం బుడమేరు ముంపు శాశ్వత నివారణ చర్యలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి.
- ఇంజినీరింగ్ నిపుణుల నివేదిక ప్రకారం డైవర్షన్ ఛానల్ సామర్థ్యం పెంచాలి.
- బుడమేరుకు రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలి.
- పూడిక తీయించి రివెటింగ్ చేయించాలి.
- ప్రభుత్వాధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఒక సమాంతర కాల్వ నిర్మించాలి.
- బుడమేరు కృష్ణానదిలో కలిసే డైవర్షన్ ఛానల్ సామర్థ్యాన్ని 17,500 నుంచి 35 వేల క్యూసెక్కులకు పెంచాలి. ప్రస్తుతం దాని సామర్థ్యం 10,500 మాత్రమే ఉంది.
- విజయవాడ దిగువన ఎనికేపాడు అండర్ ఛానల్ నుండి కొల్లేరు వరకు, అక్కడి నుంచి ఉప్పుటేరు వరకు సముద్రంలో కలిసే ప్రాంతాల్లో నీటి ప్రవాహ సామర్థ్యం పెంచాలి.
- ప్రస్తుతం దిగువకు 7 వేల క్యూసెక్కులు మాత్రమే వెళుతోంది. దాని సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచాలి.
- వెలగలేరు రెగ్యులేటర్ ఎగువన, దిగువున.. కొల్లేరు, సముద్రం వరకు మొత్తం బుడమేరును ఆధునీకరించాలి.
- కమిటీల సూచనలను ఆచరణలో పెట్టాలి. వరద నివారణకు 1964లో ఎపి మిత్రా కమిటీ అనేక నిర్మాణాత్మక సూచనలు చేసింది. అలాగే అంతకుముందు, ఆ తర్వాతా పలు కమిటీలు చేసిన సూచనలను ఆచరణలో పెట్టాలి.

15 రోజులపాటు ఆహారం పంపిణీ

సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన

- 1.75 లక్షల మంది కడుపునింపిన పంపిణీ కేంద్రాలు

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరద ముంపు సమయంలో బాధితులకు సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు అండగా నిలిచి 1.75 లక్షల మందికి 15 రోజులపాటు భోజనం ఏర్పాట్లు చేసి, అన్ని విధాలుగా ఆదుకున్నారు. నిరంతర ఆహార పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నార్తులను ఆదుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు, వాంబేకాలనీతో పాటు న్యూ రాజరాజేశ్వరిపేట, పాయకాపురం, కృష్ణాహోటల్ సెంటర్, ఊర్మిళ సుబ్బారావు నగర్లలో బాధితులకు భోజన పంపిణీ చేశారు. మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు, పం డ్లు తదితర రూపాల్లో ఆకలి తీర్చారు. బాధితులతోపాటు ప్రభుత్వం తరపున వచ్చిన సహాయ సిబ్బంది, అధికార యంత్రాంగం, పోలీసులు సైతం ఎక్కువ మంది ఈ పంపిణీ కేంద్రాల్లోనే భోజనం చేయడం విశేషం. వీటన్నింటికీ భిన్నంగా నడుంలోతు నీళ్లలో బాధితులకు అందించిన సహాయ సహకారాలను ఆ ప్రాంత వాసులు మరచిపోలేరు. వృద్ధులను, పిల్లలను వరద నీటి నుండి బయటకు తీసుకెచ్చారు. 20 రోజులకుపైగా ఆయా ప్రాంతాల్లో బాధిత ప్రాంతాల్లో కనిపెట్టుకుని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విషయంలో కీలకపాత్ర పోషించారు.

ప్రభుత్వ వైఫల్యాలు

ప్రజాశక్తి - విజయవాడ

- ఏడాది గడిచినా శాశ్వత చర్యలు తీసుకోలేదు
- ముంపు నివారణ శాశ్వత చర్యలకు కేంద్రం రూ.6,880 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి సిఎం చంద్రబాబు స్వయంగా లేఖ రాశారు. అయినా నిధులను కేంద్రం ఇవ్వడంగానీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిధుల కోసం వత్తిడి చేయడంలోగానీ పూర్తిగా విఫలమయ్యాయి.
- ఇప్పటికీ బుడమేరు ముంపు నుంచి ప్రజలకు రక్షణ లేదు.
- ఇటీవల కురిసిన వర్షాలతో బుడమేరుకు మళ్లీ వరద వస్తోందనే భయాందోళనలతో జనం బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి.
- వరద రాకపోయినా కొద్దిపాటి వర్షాలకే రోడ్లపైకి కొన్నిచోట్ల నీరు రావడం, వంతెనల మీదకు నీరు చేరడంతో ప్రజలు ఇళ్లల్లో భయంతో గడపాల్సిన పరిస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చింది.
- బుడమేరు ముంపు ఉండదని ప్రజలకు భరోసా, నమ్మకం, విశ్వాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- బుడమేరు వరద బాధితుల సహాయార్థం వివిధ సంస్థలు, దాతలు రూ.700 కోట్ల వరకు విరాళాల రూపంలో అందించారు. నిధులను ఖర్చు చేయడంలో, వాటిని ప్రజలకు జవాబుదారీగా పారదర్శకంగా తెలియజేయడంలో పూర్తిగా విఫలం.
- కొండపల్లి సమీపంలోని శాంతినగర్‌లో పడిన గండిని పూడ్చడానికి రూ.30 కోట్ల నిధులు కేటాయించి ఆ ప్రాంతంలో గండి పూడ్చి రక్షణ గోడ మాత్రమే నిర్మించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఆ పనులు కూడా ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు.
- వరద శాశ్వత నివారణ చర్యల్లో ఇంత వరకు ప్రాజెక్టు నివేదిక లేదు. కనీసం టెండర్లు పిలవలేదు.

ఇంకా మానని గాయాలు

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు బారిన పడిన ప్రజలు ఇంకా కోలుకోలేదు. వారి జీవితాలకు భరోసా లేకుండా పోయింది. దెబ్బతిన్న వ్యాపారాలు పుంజుకోలేదు. వేలాది ఇళ్లు రిపేర్లకు నోచుకోలేదు. ఇప్పుడు కూడా చిన్న వర్షం పడితేనే వరద వస్తుందనే ఆందోళనలో ప్రజలు ఉన్నారు. వరద వచ్చి ఏడాది గడిచినా ప్రభుత్వం ప్రకటించిన నామమాత్రపు సహాయం కూడా అందించలేదు. అప్పట్లోనే నెలరోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిదుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. కొన్ని వ్యాపారాలు మూతపడ్డాయి, మరికొన్ని దెబ్బతిన్నాయి. ఇప్పటికీ వాహనాలు పూర్తిగా రిపేర్లకు నోచుకోలేదు. అరకొర రిపేర్లతో ఆటోలకు మళ్లీ మళ్లీ రిపేర్లు వస్తున్నాయి. దీంతో వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. వ్యాపారులు, జనం అప్పుల పాలయ్యారు. ప్రభుత్వం చెప్పిన విధంగా బ్యాంకులు ఎటువంటి రాయితీలు ఇవ్వలేదు. దెబ్బతిన్న ఇల్లు రిపేర్లు చేసుకునే పరిస్థితి లేదు. వాహనాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం పూర్తిగా అందలేదు. వన్ టైం సెటిల్మెంట్ పేరుతో నామమాత్రపు సహాయం అందించారు.

సింగ్‌నగర్ ప్రాంతంలో వరద దుస్థితి (ఫైల్)

రైల్వే పట్టాలపైకి చేరిన వరద నీరు (ఫైల్)

సింగ్‌నగర్ మునగడానికి కారణమైన బుడమేరు గండి (ఫైల్)

స్థానికులకు సాయం చేస్తున్న బాబూరావు

సిపిఎం ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్)

వరదలో వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం బృందం (ఫైల్)

వరదలో సామానులు తరలించుకుంటున్న స్థానికులు (ఫైల్)

వరదలో ఇరుక్కుపోయిన 108 వాహనం (ఫైల్)

తాడు సాయంతో వరద నుంచి బయలకు వస్తున్న స్థానికులు (ఫైల్)

నీట్‌లో నిఖిల్‌కు 248వ ర్యాంకు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు మాలోతు శ్రీహరి కుమారుడు నిఖిల్ ఎయిమ్స్ భూపాల్‌లో ఎంబిబిఎస్ చదువు పూర్తిచేసుకుని, నీట్ పీజీలో ఆల్ ఇండియా క్యాటగిరిలో 248 ర్యాంకు సాధించాడు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే తాతయ్య, ఎమ్మెల్యే సోదరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీరాం సాయిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య శాలువాతో నిఖిల్‌ను సన్మానించి అభినందించారు. శ్రీహరి కుమారుడు నిఖిల్‌లతో ఎమ్మెల్యే తాతయ్య, సాయిప్రసాద్‌లు మాట్లాడుతూ చదువు పూర్తి చేసుకున్న తర్వాత పేదలకు వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లి రవిచంద్, ఉపాధ్యాయులు నేలవల్లి రమేష్ బాబు, జడ వెంకటేశ్వరరావు, కే రామాంజనేయులు, కే రాజేంద్ర, ఈ నరసింహారావు, టి నరసింహారావు, గంపలగూడెం ఎంఈఓ పివిడిఎల్ నరసింహారావు, మూర్తి, ఎల్వి సత్యనారాయణ, బి శ్రీనివాస్, సిహెచ్ వెంకటేశ్వరరావు, వ్యాపారులు రవి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పనలో ప్రభుత్వాలు విఫలం : ఐద్వా

ప్రజాశక్తి-తిరువూరు

ఐద్వా తిరువూరు పట్టణ మహాసభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మునిగంటి లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. మహిళలపై హత్యలు, హత్యాచారాలు రోజు రోజుకు పెరిగిపోతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కూడా కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా తిరువూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.కుమారి, ఎం.లక్ష్మీ ఎన్నికయ్యారు. ఉపాధి కోల్పోతున్న మహిళలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తిరువూరు నగర పంచాయతీలో కూడా అమలు చేయాలని, గ్రామాల్లో బెల్టు షాపులను నిషేధించాలని, ఉచిత బస్సుల సర్వీసులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ చేసిన తీర్మానాలు మహాసభ ఆమోదించింది.

ధ్యాన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-విజయవాడ

బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ధ్యానం తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన దైనందిన జీవితంలో ధ్యానంను భాగం చేసుకోవాలని, ధ్యానం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్లకు బోధనేతర పనులు రద్దు చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-మైలవరం

ప్రభుత్వ పాఠశాలల్లో భోదనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో యుటిఎఫ్‌లో ఛాంపియన్ సంఘంగా నిలపడంలో అనేకమంది ఉద్యమ నాయకుల త్యాగాలు ఉన్నాయని వారి త్యాగాలు స్ఫూర్తితో ప్రస్తుత నాయకత్వం పనిచేసి ఉపాధ్యాయులకు విద్యా రంగానికి సేవ చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ మాట్లాడుతూ పాత పద్ధతిలోనే పరీక్షా విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ముందుగా ఎస్‌టిఎఫ్‌ఐ జెండాను పూర్వపు జిల్లా గౌరవాధ్యక్షులు జి పాల్ బాబురావు, యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు పి వెంకటేశ్వర రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య యుటిఎఫ్ చేసిన పోరాటాలు వివరించి భవిష్యత్తులో పాఠశాలల అభివృద్ధి, సంఘం అభివృద్ధి రెండు నేత్రాలుగా ఉపాధ్యాయులు పని ఉండాలని నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా కోశాధికారి ఈ నాగేశ్వరరావు ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం కృష్ణయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు మచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కె గంగరాజు, బి.సూర్యనారాయణ, పి భవాని, రమణయ్య, లింగారెడ్డి, సిఐటియు నాయకులు సిహెచ్ సుధాకర్, మైలవరం మండలం నాయకులు ఎం తిరుపతిరావు, వి వసంతరావు, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డు నాగేశ్వరరావు

ఏకత్వ పాఠశాలలో రక్తదానం

నందిగామ : నందిగామ ఏకత్వ పాఠశాలలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ రక్త దాన శిబిరాన్ని నందిగామ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ అమరనేని రమేష్ బాబు, ఏకత్వ పాఠశాల డైరెక్టర్ అమరనేని మనోజ్ ప్రారంభించి రక్త దానం ఆవశ్యకతను వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు మధన్‌మోహన్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం మండల టిడిపి అధ్యక్షునిగా వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

రెడ్డిగూడెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా సీనియర్ నాయకుడు జానలపాటి వేణు గోపాల్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు నిర్ణయం తీసుకున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-వీరులపాడు

వికసిత్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా కేశినేని శివనాథ్ (చిన్ని) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వీరులపాడు మండలం జమ్మవరం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, పోటీ తత్వం పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దఢత్వాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్ కేశినేని వెంకట్‌తో కలిసి ఫైనల్లో విజేతగా నిలిచిన జమ్మవరం లెవెన్స్ జట్టుకు బహుమతులు అందజేశారు.

సాంకేతికత మానవ సంక్షేమానికి ఉపయోగపడాలి

- జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీధర్

మురళీమోహన్

గంగాధర్‌రావు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

సాంకేతిక అభివృద్ధి మానవ సంక్షేమానికి ఉపయోగపడాలి తప్ప వినాశనానికి కాదని జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీధర్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా 18వ మహాసభ కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ సైన్స్ సాధించిన అభివృద్ధితో మారణాయుధాలు తయారుచేసి యుద్ధాలకు ఉపయోగించడం బాధాకరమన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలలో జెవివి అవగాహన పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెలగా శ్రీనివాస్, శోభన్, డాక్టర్ మామిడి సీతారామారావు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి ప్రసంగించారు. మహాసభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.మురళీ మోహన్ (కొండపల్లి), ఎల్.గంగాధర్ (తిరువూరు) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ వి.రవీంద్ర, డాక్టర్ ఎం.సీతారామారావు, కోశాధికారిగా భాను ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పి.కామేశ్వరరావు, వెలగ శ్రీనివాస్, ఎం.హరికృష్ణ, జి.మల్లికార్జున రెడ్డి, కార్యదర్శులుగా ఎం.రాంప్రదీప్, బి.రవి, జె.సుబ్బారావు, ఎస్.డి.మస్తాన్ వలీ, సమతా కన్వీనర్ గా భగీరథి, కో - కన్వీనర్ గా జె.ఉషారాణి, చెకుముకి కన్వీనర్ గా ఇమామ్, యూత్ కన్వీనర్ గా సురేంద్ర, జిల్లా కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, ఎం.సుధాకర్, పి.శీనయ్య, రాం కుమార్, సర్దార్ సాహెబ్, కె.రామారావు, బి.సైదులు, యలమందయ్య, జి.దుర్గ, కె.శేషగిరి, రాధాకష్ణా రెడ్డిని ఎన్నుకున్నారు.

గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ డివిజన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్, అమ్మ డయాగ్నస్టిక్స్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఆర్‌ఎంపిల ఆత్మీయ సమావేశం ఆదివారం నందిగామ పట్టణం రైతుపేట ఓసి క్లబ్‌లో నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సురాబత్తుల కోటేశ్వరరావు (అమ్మ కోటి) కుమార్తె మేఘన జన్మదిన వేడుకలు కూడా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని మేఘనకు ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, నందిగామ డివిఆర్ గవర్నమెంట్ హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నందిగామ: నందిగామ ఆర్.ఎస్. గార్డెన్స్‌లో ఆదివారం రూరల్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం జరిగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ హాజరై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సంఘ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో ఎంఎల్‌ఏ కొలికపూడి

ప్రజాశక్తి-విస్సన్నపేట: విసన్నపేట మండలంలో ఆదివారం తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని వినాయక ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో భానవత్తు తండాలో వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొని రూ.60 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు అందించారు.

వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా రాము

రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అనుబంధ విభాగ అధ్యక్షుడిగా నాగులూరు గ్రామానికి చెందిన మట్టకొయ్య రామును ఎంపిక చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగి రమేష్ ఎంపిక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి చాట్ల రాబర్ట్, మైలవరం నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు దయాకర్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గుడిసే ప్రభాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

నందిగామలో రక్తదాన శిబిరం

నందిగామ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా నందిగామ క్లాత్ మర్చంట్ హాల్లో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల అనేక మంది ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

● అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేయడం ద్వారా ఇప్పటికే పని చేస్తున్న మినీ వర్కర్లకు వేతనం పెరగడంతో పాటు 4687 సెంటర్లలో ఆయా పోస్టులు రావడం పోరాటాల ఫలితమేనని అంగ న్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావమ్మ పేర్కొన్నారు. మినీ వర్కర్స్ కి మెయిన్ వర్కర్గా జీవో ఇచ్చిన సందర్భంగా ఆదివారం బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ అభినందన సభకి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుబ్బారావమ్మ మాట్లాడుతూ ఐకమత్యంగా పోరాడితే ఎంతటి కఠిన సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు యూనియన్ పరంగా సంఘటితంగా ఉండి పోరాడితే మరిన్ని విజయాలు సాధించవచ్చు అన్నారు. కృష్ణా జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు కే లక్ష్మి, సిహెచ్ నాంచారమ్మ, జి గోపి లక్ష్మి, ఏ నాగమణి, కే ఉమారాణి, శివకుమారి, రాజరత్నం, ఉమారాణి, శివకుమారి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్లం వెంకటేశ్వరరావు , మినీ వర్కర్స్ కూడా పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని నిరసన

ప్రజాశక్తి-మొవ్వ : మండలం లోని నిడు మోలు గ్రామంలో జాతీయ రహదారి నుండి ఉప్పలపు వెంకటాద్రి ఇంటి వరకు ఉన్న జిల్లా పరిషత్ రోడ్డు నిర్మాణం చేపట్టి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి చేయలేదని ఆదివారం రోడ్డుపై గ్రామస్తులు నిరసన తెలిపారు. బంక రాళ్లు పరిసి పూర్తి చేయకుండా ఉండటంతో ప్రజలకు, విద్యార్థిని విద్యార్థులకు, హాస్పిటల్, సచివాలయానికి వెళ్లే ప్రజానీకానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. ఒక్కొక్కసారి వాహనాలు స్లిప్పయి పడిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల నిరసనకు సిపిఎం గ్రామ శాఖ మద్దతు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మద్దుల బసవరావు , పార్టీ శాఖ కార్యదర్శి ఉప్పలపు వెంకటాద్రి, పార్టీ సభ్యులు జొన్నలగడ్డ వాసు, కొనకళ్ల రాంబాబు, గ్రామస్తులు కొలుసు శీను, డొక్కు శీను, పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తున్న బిజెపి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-కంకిపాడు : దేశంలో పాలక బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఓట్లు చోరీ ఘటనలపై రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న మండేపూడి నాగభూషణం భవనం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు మాట్లాడుతూ బిజెపి తన పాలనలో రాజ్యాంగ లౌకిక హక్కుల్ని కాలరాస్తోందన్నారు. కనీసం ఓటు హక్కును కూడా లేకుండా చేస్తున్నారని ఈ నేపథ్యంలో లోకసభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన యాత్రకు ఉత్తర భారతదేశంలో ప్రతిఒక్కరు మద్దతుగా నిలిచి పోరాడుతున్నారన్నారు. ఈనెల 17న తాడిగడప సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి పోరంకి మున్సిపల్ కార్యాలయం వరకు జరిగే భారీ ప్రదర్శన విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఈదర రాజశేఖర్ వర్మ , భుజంగ నాయక్ , బూరగడ్డ ఉదయ్ కుమార్, సిపిఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శి బండి ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షులు బాలాజీనాయక్ పాల్గొన్నారు.

15న ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పామర్రు : భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ ఏపీ బిల్డింగ్, అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 15వ తేదీ రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం (విజయవాడ)వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులం దరూ పాల్గొని విజయవంతం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి గోపాలరావు పిలుపు నిచ్చారు. పామర్రు లోని సిఐటియు కార్యాలయంలో భావన నిర్మాణ కార్మికులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉండగా అందులో 18 లక్షల మంది రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లను నమోదు చేసుకుని ఉన్నారని అన్నారు. తమిళనాడు, కర్ణాటక, హర్యానా వంటి అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అదే రీతిలో ఇక్కడ కూడా పథకాలు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వేము పెదబాబు,జిల్లా నాయకులు సందీప్ ఆలీ,మండల అధ్యక్షుడు చొప్పకట్ల రమేష్,ఎర్రంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

అక్షయకు సన్మానం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని మలకా పట్నం పికేఎం కాలనీకి చెందిన కుంపటి ప్రసాద్ (న్యాయవాది) అమ్మాజీ దంపతుల కుమార్తె కుంపటి అక్షయ మౌళి ఈ విద్యా సంవత్సరం నీట్‌లో ఎంబిబిఎస్ సీటు సాధించిన సందర్భంగా మలకాపట్నం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మలకాపట్నంలో సీనయ్య మాస్టర్ అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేసారు. 19వ డివిజన్ కార్పొరేటర్ దేవరపల్లి అనిత, డాక్టర్ బందెల తామస్ డే నోబుల్, కొడాలి అజయ్ కుమార్, బీడెల్లి కుమార్. పెనుమచ్చ మధు,బందారు నాని,కొడాలి యోహాన్ ,కొడాలి సుధీర్ పాల్గొన్నారు.

కవితల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మంచిని వెలుగులోకి తీసుకు రావడానికి సాహిత్య ప్రక్రియ దోహదపడాలని మిత్రుల వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్ర జాతీయ బిఈడి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రావి రంగారావు పేర్కొన్నారు. ఆదివారం మచిలీపట్నం సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డాక్టర్ శోభా స్మారక కవితల పోటీ విద్యార్థుల బహుమతి ప్రధానోత్సవం మహతి కళావేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్నం సాహితి మిత్రులు అధ్యక్షులు లంకి శెట్టి బాలాజీ అధ్యక్షత వహించగా, మాజీ ప్రిన్సిపాల్ రావి రంగారావు మాట్లాడుతూ అవినీతిని, లంచగొండులను, సమాజ వ్యతిరేక శక్తులను అరికట్టేలా సాహిత్య ప్రక్రియ ఉండాలని అన్నారు. విజేతలుగా కాకినాడకు చెందిన డి నాగజ్యోతి శేఖర్ , గుంటూరుకు చెందిన సూర్యదేవర రవికుమార్, హైదరాబాద్ కి చెందిన ఎం. లహరి, అనకాపల్లికి చెందిన కోరాడ అప్పలరాజు, నెల్లూరుకు చెందిన గండికోట సుధీర్ కుమార్ , విజేతలుగా నిలిచారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టీ. పెద్దిరాజు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ భగత్ కుమార్, సంస్థ కార్యదర్శి మేడిశెట్టి యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుదరవల్లిలో వెలగని వీధిదీపాలు

ప్రజాశక్తి- నందివాడ : మండలంలోని కుదర వల్లి గ్రామంలో అక్కినేని వారధిపై వీధిలైట్లు లేక వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. నిత్యం వందల సంఖ్యలో ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. వారధిపై వీధిలైట్లు లేకపోవడంతో ఇదే ఆసరాగా చేసుకున్న మందుబాబులు వారధిపై మద్యం సేవిస్తూ మందు సీసాలను వారధిపై పగలగొట్టడంతో సీసాలు గుచ్చుకొని పాదచా రులు నానా అవస్థలు పడుతున్నారు. వీధిలైట్లు వెలగక రాత్రిపూట అంధకారంలో జనం అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు బయటికి రావాలంటే పాములు, తేళ్ళు ఎక్కడ కాటేస్తా యోనని భయంతో ఉన్నారు. అధికారులు వెంటనే స్పందించి వారధి పై లైట్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చీకటిమయంగా ఉన్న రహదారి

నాగమణి నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్‌గా తెలుగుదేశం మహిళా నేత మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి నియమితులయ్యారు. చల్లపల్లి మండలం పరిషత్ కు గత పాలకవర్గంలో వైస్ ఎంపీపీగా పనిచేసిన నాగమణి తెలుగు మహిళా నేతగా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, అవనిగడ్డ శాసన సభ్యులు మండల ప్రసాద్‌లకు నాగమణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కొనకళ్ల నారాయణరావు, మండలి బుద్ధ ప్రసాద్‌లను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థా నంలో ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. సుమారు 10వేల పైగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. అత్యధిక సంఖ్యలో అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణా ధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఐవిఎం సురేష్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-చల్లపల్లి : పేదరికంలో ఉన్న ప్రతిభావంతులను గుర్తించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సురేష్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పురిటి గడ్డలో ఐవిఎం హెూమ్‌లో ఇండియా లో విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు లాప్టాప్ లు, ఉన్నత విద్యను అభ్యర్థిస్తున్న విద్యార్థులకు స్కాలర్ షిప్పులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ఐవీఎం సాయం పొందిన వారు జీవితంలో ఎదిగి తోటి వారు సాయం అందించాలని సూచించారు. అనంతరం 15 మంది విద్యార్థులు విద్యార్థులకు ఏడు లక్షల రూపాయల విలువైన లాప్ టాప్‌లను అతిథులు అందించారు. ఇంటర్ నుండి యూనివర్సిటీ వరకు 100 మంది విద్యార్థి విద్యార్థులకు 40 లక్షల రూపాయల స్కాలర్ షిప్ పంపిణీ చేశారు. ఒకటి నుండి 10వ తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలో చదివి 175 మందికి రూ.20 లక్షలు మేర ఫీజులు చెల్లించారు. మొత్తంగా రూ 67 లక్షలు ప్రతిభావంతులను పేద విద్యార్థులకు సాయం అందించారు. విశ్రాంత డిఎస్పి హరి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగిన సభలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబా బు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, సిఐ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతలు రూ.50వేల విరాళం ఇచ్చారు. ఆదివారం ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. గుడ్లవల్లేరు మాజీ సర్పంచి స్వర్గీయ వల్లభనేని శ్రీకృష్ణ స్మారకార్థం కుమారులు రామ్‌చంద్, ఫణీంద్ర విరాళం ఇచ్చారని వెంకట్రావు, ధర్మకర్త మురాల నరేష్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి

- సెంట్రల్ సిటీ భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలో అప్పారావు, వెంకటేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి-విజయవాడ

నిర్మాణ రంగంలోని కార్మికులందరూ ఐక్యంగా పోరాడి సంక్షేమ బోర్డును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విజయవాడ సెంట్రల్ సిటీ 11వ మహాసభ సింగ్‌నగర్ సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగింది. ముందుగా ఈ మధ్యకాలంలో మరణించిన ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజాతంత్ర, యువజన, మహిళ సంఘాల నాయకులు, కార్మికులకు, వివిధ పార్టీ నాయకులకు, వివిధ విపత్తులు, మత ఘర్షణలు, ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన మృతులందరికీ మహాసభ ఘనంగా నివాళు లర్పించింది. మహాసభకు యూనియన్ నాయకులు ఎన్.పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అప్పారావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర కాలం గడుస్తున్నా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించిన పరిస్థితి లేదన్నారు. దీనికి తోడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని మండిపడ్డారు. సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని అన్నారు.

38 మందితో నూతన కమిటీ

సెంట్రల్ సిటీ భవన నిర్మాణ కార్మిక సంఘం 38 మందితో నూతన కమిటీ ఏర్పడింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్.పవన్ కుమార్, బి.గోవిందు ఎన్నికయ్యారు. 17 మంది ఆఫీస్ బేరర్స్‌గా, 21 మంది కమిటీ సభ్యులుగా, మొత్తం కమిటీ 38 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జి.గోవిందు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యం.బాబురావు, కోశాధికారిగా యం.రాము, ఉపాధ్యక్షులుగా వై.సత్యనారాయణ, కె.రాజేష్, బి.సత్యనారాయణ, జి.కృష్ణ, బొబ్బిలి శ్రీను, చింతల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా యం.మురళి, ఎల్.అస్సినాయుడు, డి.దుర్గాప్రసాద్, ఎస్‌కే భాష, కె.రాజేష్, బి.రమణరావు, కమిటీ సభ్యులు సభ్యులుగా 21 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పశ్చిమ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్ సుధాకర్ రెడ్డి, కె.శంకర్, తూర్పు సిటీ ప్రధాన కార్యదర్శి వి.బి.ఎస్ రాజు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల నష్టపోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు బ్యాడ్జితో సంబంధం లేకుండా సంవత్సరానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని సితార సెంటర్లో ఆదివారం ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ ఆటో యూనియన్ నగర నాయకులు ఎం.హనుమంతరావు, ఎస్.డి కరిముల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకానికి సిఐటియు మద్దతిస్తుందని, అదే సందర్భంలో ఆటో డ్రైవర్లు, కార్మికులు ఉపాధిని కోల్పోయారని తెలిపారు. ఆటో అద్దె, ఫైనాన్స్ కిస్తీ, పెరిగిన పెట్రోల్, డీజిల్ ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రభుత్వం స్పందించి బ్యాడ్జితో సంబంధం లేకుండా ప్రతి ఆటో కార్మికునికి ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, గ్యాస్ ఫిల్లింగ్‌పై సబ్సిడీ అందించాలని, ఆర్టీవో సేవల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కృష్ణ, తులసి, చంటి, మస్తాన్ పాల్గొన్నారు.

వైసిపి మైనారిటీ సహాయకార్యదర్శిగా షేక్ బషీర్ నియామకం

ప్రజా శక్తి - విజయవాడ సిటీ

ఇటీవల నూతనంగా వైసిపి రాష్ట్ర మైనారిటీ విభాగం సహాయ కార్యదర్శిగా నియమితులైన షేక్ మొహమ్మద్ బషీర్ అహ్మద్ ఆదివారం స్థానిక బ్రాహ్మణ వీధిలోని విజయవాడ పశ్చిమ వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ మొహమ్మద్ బషీర్ అహ్మద్‌ను వెలంపల్లి శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి అభివృద్ధికి కృషి చేయాలనీ తెలిపారు.

నేడు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ

సెప్టెంబర్ 1వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

టాటా ర్యాలీస్ ఇండియా నుంచి డోడ్రియో

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

డోడ్రియో ఉత్పత్తి మార్కెట్లోకి విడుదల సందర్భంగా భారతీయ అగ్రి ఇన్పుట్ల పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న ర్యాలీస్ ఇండియా లిమిటెడ్, (టాటా ఎంటర్ ప్రైజస్) వరిలో పాముపొడ తెగులు నివారణకు డిడ్రోయో అనే కొత్త ఉత్పత్తిని ప్రారంభించినట్లు సంస్థ సేల్స్ హెడ్ పి.రాజా తెలిపారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో శిలీంద్ర నాశన విభాగంలో పేరుగాంచిన టాటా ర్యాలీస్ తన శిలీంద్ర నాశన ఉత్పతులలో పాముపొడ వంటి తెగుళ్ళ నుండి పంటను రక్షించే వ్యవసాయ పరిష్కారాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ అందిన "గోప్ప భద్రత శక్తివంతమైన సాంకేతికతతో కూడిన డోడ్రియో మూడు రసాయనాల శక్తితో కూడుకున్నదని అన్నారు. కాంటాఫ్, కాంటఫ్ ప్లస్ మొట్టమొదటిసారిగా ద్రవ రూపంలో మార్కెట్లోకి తీసుకొని రావటమనేది ర్యాలీస్‌తో సాధ్యమైనదని పేర్కొన్నారు. ఇది ఎవరగ్రీన్ ప్రోడక్ట్ అని తెలిపారు. ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ సౌత్- ఈస్ట్ మార్కెటింగ్ హెడ్ వై.రవికృష్ణ, మాట్లాడుతూ "పొడ తెగులు నివారణకు మార్కెట్లో అనేక రసాయనాలు ఉన్నప్పటికీ డిడ్రోయో మిగిలిన వాటికి భిన్నమైనదని, దీనిని వాడే పద్ధతి పరంగా, ఈ విభాగంలో ప్రత్యేక స్థానాన్ని పొందుతుంది" అని తెలిపారు.

ఆరోగ్య గమ్యానికి సైకిల్ సవారీ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ

ఆరోగ్యం, ఆహ్లాదం.. ఆపై పర్యావరణ పరిరక్షణకూ సైక్లింగ్ చేయూతనిస్తుందని, చిన్నారులు, యువత సైకిల్ సవారీని అలవాటుగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతోపాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పెడల్ ఫర్ ఫిట్నెస్ అండ్ యునిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్‌లో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృ వనం నుంచి ప్రారంభమైన ఈ రైడ్ బెంజ్ సర్కిల్, రామవరప్పాడు, బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్, మునిసిపల్ ఆఫీస్, ప్రకాశం బ్యారేజ్, కంట్రోల్ రూమ్, స్టేడియం వరకు మొత్తం 21 కి.మీ. మేర సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే సైక్లింగ్‌ను హాబీగా మార్చుకొని ముందుకువెళ్లాలని, ఓ మంచి అలవాటు ఎన్నో విజయాలకు సోపానమవుతుందని పేర్కొన్నారు. లండన్ బి ఎడిన్బర్గ్ బి లండన్ (ఎల్ ఈ ఎల్) సైక్లింగ్ ఈవెంట్ బి 2025లో పాల్గొన్న నిషికాంత్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అమరావతి రన్నర్స్ ప్రెసిడెంట్ ఆర్.రమేష్ రవి, సభ్యులు బసవేశ్వరరావు, జీవీ సత్యనారాయణ, నిషికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థను పటిష్టం చేయాలి

- కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం

ప్రజాశక్తి-విజయవాడ



సహకార వ్యవస్థను పటిష్ట పరచాలని కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర మాజీ మంత్రి నెట్టెం రఘురాం అభినందన సభ ఆదివారం ఎపి కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, పిఎసిసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం ప్రసంగిస్తూ కెడిసిసి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడతానని, వేతన సవరణ, శాశ్వత ఉద్యోగాలు, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు వంటి పలు సమస్యల పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. కెవిఎస్ రవికుమార్, బొల్లినేని రఘురాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వి రాధాకృష్ణ మూర్తి, ఎఐటియుసి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు మాట్లాడుతూ సహకార బ్యాంకింగ్ రంగంలో రెండంచెల విధానం తీసుకురావాలని దీనివల్ల రైతులతో పాటు అన్ని వర్గాలకు ప్రయోజనం అని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కినేని ఆంజనేయ ప్రసాద్ సత్యనారాయణ రెడ్డి బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్ర శత జయంతి

విజయవాడ : అభ్యుదయ కవి, సినీగీత రచయిత ఆరుద్ర శతజయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం విజయవాడలో సినీ సంగీత విభావరి కార్యక్రమాలు జరిగాయి. స్వరలయ, సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ వీహెచ్ గ్రంథాలయంలో "కొండగాలి తిరిగింది.. గుండె ఊసులాడింది.." అలరించింది. గాయనీ గాయకులు కె.వి.ఆనంద్, ఎన్.ఆర్.నరసింహం, నూకల ప్రభాకర్, శాంతిశ్రీ, జ్యోతిర్లత, టి.శ్రీకాంత్, టి.నాగభూషణం పలు సినీ గీతాలతో ఆహ్లాదపరిచారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి, ఉపాధ్యక్షులు పి.మోహన్ రాంప్రసాద్, కార్యదర్శి ఎస్.ఆర్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాపూర్ణానందం కళావేదికపై....

స్వరలయ వేదిక సంగీత సాంస్కృతిక సంస్థ (తెనాలి) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కౌతాపూర్ణానంద కళావేదికపై "ఇది తీయని వెన్నెల రేయి" జరిగింది. ఈ సందర్భంగా గాయనీ గాయకులు హరికృష్ణ, సత్యవర్ధన్, వి.శ్రీనివాస్, డాక్టర్ ఎం.వి.సత్యనారాయణ, శిరీష, మల్లేశ్వరి, డాక్టర్ అమలారాణి వివిధ పాటలతో ప్రేక్షకుల్ని అలరించారు. సాయి లక్కరాజు, చావా నరసింహారావు (డ్రీమ్ ఆడియో, విజయవాడ) పాల్గొన్నారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.